# డేంజర్ మలుపులు

**చెరువుకట్ట కింద ప్రమాదకరంగా ఉన్న మలుపుల రహదారి**

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో అధికారుల విఫలం


న్యామద్దెల చెరువుకట్ట కింద ఉన్న మలుపు

**చెన్నేకొత్తపల్లి:** మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. వాహనదారులు వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. న్యామద్దెల గ్రామ సమీపంలో చెరువు కట్టకింద ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. చెరువుకట్ట ప్రారంభం నుంచి ముగింపు వరకు దాదాపు నాలుగైదు ప్రాంతాల్లో మలుపులు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా ముష్టికోవెల, సుబ్బరాయనిపల్లి, గువ్వలగొందిపల్లి, చిన్నంపేట గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో చిన్నంపేట మినహా మిగిలిన గ్రామాలకు ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఈ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం కనిపించవు. ఈ రహదారిలో కొత్తవారు వాహనాలు నడిపితే అంతే సంగతులు. చెరువుకట్టతో పాటు రహదారికి ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఎలాంటి హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. గతంలో ఈ మలుపుల వద్ద ప్రమాదాలు జరిగినా.. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇక ఒంటికొండ నుంచి ఆమిదాలకుంట గ్రామాలకు వెళ్లే రహదారిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యామద్దెల చెరువు కట్టపై పెరిగిన కంపచెట్లను తొలగించాల్సిన అవసరం ఉంది. మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



న్యామద్దెల చెరువు కట్ట కింద మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనదారులు కూడా మలుపుల వద్ద నిదానంగా వెళ్లాలి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి. ఈ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– ముత్యాలు, సీపీఐ నాయకుడు, చెన్నేకొత్తపల్లి మండలం

### కంపచెట్లను తొలగించాలి



న్యామద్దెల గ్రామానికి వెళ్లే రహదారిలో చెరువుకట్ట కింద రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. కంపచెట్లను తొలగించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఎదురుగా వాహనాలు వచ్చినపుడు రోడ్డు పక్కకు వెళితే కంపలు తగిలి గాయాలు అవుతున్నాయి. కంపచెట్లును తొలగించి ప్రమాదాలు జరగకుండా నివారించాలి.

– లింగన్న, సీపీఎం నాయకుడు, చెన్నేకొత్తపల్లి మండలం

### నివేదికలు పంపాం

మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకరంగా మలుపులు ఉన్న విషయం వాస్తవమే. రహదారిపై గుంతలు పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రహదారుల మరమ్మతులకు నివేదికలు తయారు చేసి పంపాం. వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయిస్తాం.

– నారాయణ స్వామి, ఏఈ, పంచాయతీ రాజ్ రహదారుల విభాగం

## క్లుప్తంగా

### నిత్యావసరాలు సరిగా అందించకపోతే చర్యలు

**ధర్మవరం అర్బన్:** చౌకధాన్యపు డిపోలకు నిత్యావసర సరుకులను సక్రమంగా అందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ హెచ్చరించారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌యార్డులోనున్న గోడౌన్‌లను శుక్రవారం ఆర్డీఓ మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లోని స్టాకు రిజిస్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

### మున్సిపల్ కార్మికుల నిరసన


మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ధర్మవరం:** జీఓ నంబర్ 35 ప్రకారం జీతాలు చెల్లించాలని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు బొగ్గు నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు.

**పుట్టపర్తి టౌన్:** ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుటకార్మికులు ధర్నా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు గంగాద్రి, తదితరులు పాల్గొన్నారు.

### మహిళపై టీడీపీ నేతల ప్రతాపం

**సాక్షి, టాస్క్‌ఫోర్స్:** ఇది రామగిరి.. ఇక్కడ మేం చెప్పిందే జరగాలి.. వినాలి.. లేకుంటే ఇల్లయినా, దుకాణమైనా ఖాళీ చేసి వెళ్లాల్సిందే అంటూ టీడీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతూ గ్రామాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. మండలంలోని కానుగులకుంటలో రామాంజినమ్మ అనే మహిళ తన సొంత స్థలంలో కిరాణా దుకాణం పెట్టుకుంది. శుక్రవారం దుకాణం వద్దకు వచ్చిన స్థానిక టీడీపీ నేతలు రామాంజినమ్మతో దురుసుగా ప్రవర్తించారు. దుకాణం వెంటనే ఖాళీ చేయాలని బెదిరించారు. ఇక్కడ అంగన్‌వాడీ భవనం నిర్మిస్తామంటూ ఇష్టం వచ్చినట్లు తిట్టారు. గ్రామానికి సంబంధించిన సర్వే నంబర్ 111 లో గతంలో ఇంటి స్థలం కోసం కేటాయించిన స్థలంలో కిరాణా దుకాణం పెట్టుకున్నట్లు రామాంజినమ్మ తెలిపింది. బెదిరించిన టీడీపీ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.

### రుణాలు సక్రమంగా చెల్లించాలి


కుట్టుమిషన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రామగిరి:** స్వయం సహాయక సంఘం సభ్యులు తీసుకున్న రుణాలను చెల్లిస్తే తిరిగి కొత్త రుణాలు పొందవచ్చని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల మహిళా సంఘం సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు మండలాలలో మొత్తం 3,003 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. అందులో ఏగ్రేడ్ 1,871, బీగ్రేడ్ 945, సీగ్రేడ్‌లో 182 సంఘాలు ఉన్నట్లు తెలిపారు.

### ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

**నల్లమాడ:** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి హెచ్చరించారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు సంజాయిషీ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్‌ను ఆదేశించారు.

**వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి**

**నల్లమాడ:** పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఆర్.రామాపురం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల, నల్లమాడలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, యుటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## 12వ పీఆర్సీ అమలు చేయాలి


యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ కృష్ణయ్య, యూటీఎఫ్ నాయకులు

**పుట్టపర్తి అర్బన్:** ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించి, వెంటనే 12వ పీఆర్సీ అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏపీ యూటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు వాల్ క్యాలెండర్, డైరీ, స్టిక్కర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

**ఓడీచెరువు:** మండల కేంద్రంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారులు రమణ, సురేష్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్, మండల ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, జనార్దన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చేనేతల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా నాయకులు

**ధర్మవరం:** చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, నియోజకవర్గ కార్యదర్శి మధులు తెలిపారు. పట్టణంలోని కదిరిగేటు వద్దనున్న నేతన్న విగ్రహం వద్ద ఏపీ చేనేత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్‌యాదవ్, చేనేత జౌళిశాఖ మంత్రి సవితలు ఉన్నా కూడా ఇంత వరకు చేనేతల సమస్యలపై చర్చించిన పాపాన పోలేదన్నారు. ప్రతి చేనేత కార్మికునికి ముద్ర రుణాలు విధిగా ఇవ్వాలని, 200 యూనిట్‌లు విద్యుత్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని, ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, పోలా లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పన్ను బకాయిలు చెల్లించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి టౌన్:** మున్సిపాలిటీలో బకాయిపడిన ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ జాగా పన్నులు ప్రజలు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పట్టణంలో ఖాళీ జాగా పన్నులు తక్షణమే చెల్లించడంతోపాటు కొత్తగా ఖాళీ జాగా పన్నులు వేసుకోవడానికి మునిసిపల్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈనెల 3 నుంచి ఖాళీ స్థలాలు విక్రయించాలన్నా, కొనాలన్న.. తప్పనిసరిగా ఖాళీ స్థలా పన్నులు చెల్లించి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆస్తి పన్ను అధిక మొత్తంలో బకాయి ఉన్న 100 మంది పేర్లను ఫ్లెక్సీలో రాయించి పట్టణ ప్రధాన సర్కిళ్లలో ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో అనధికార నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు.

**స్టడీ మెటీరియల్ పంపిణీ**

**ఎన్‌పీకుంట:** ఎస్టీయూ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

## సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే


వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**కదిరి అర్బన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. స్మిత ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు సావిత్రిబాయ్‌పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీసీ బాలికల వసతి గృహంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు సంపంగి గోవర్దన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. గట్ల వద్ద నున్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

**కదిరి అర్బన్:** స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి,ఎంఈఓ ఓబుల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చలం, వరప్రసాద్‌రాజు, నాగరాజు, నాయకులు రవినాయక్, జవహర్, వీరనారాయణమ్మ,సునీత తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం:** దేశ చరిత్రలో స్త్రీవాద ఉద్యమానికి మార్గదర్శకురాలిగా సావిత్రిబాయి పూలే నిలిచారని వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ హర్షవర్ధన్ తెలిపారు. వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య పాఠశాలలో హెచ్‌ఎం నరేంద్రబాబు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు.

**పుట్టపర్తి అర్బన్:** పుట్టపర్తి ఎమ్మార్సీలో శుక్రవారం వైఎస్సార్‌టీఏ ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ఎంఈఓ ప్రసాద్ ఉపాధ్యాయులు రజనీకాంత్‌రెడ్డి, సునీత, శకుంతల, రాధారాణి ప్రశాంతి ఉన్నారు.

**ముదిగుబ్బ:** జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓలు వేమనారాయణ, రమణప్పలు ఆధ్వర్యంలో 22 మంది ఉపాధ్యాయునులను సన్మానించారు.

### మద్దెలచెరువు సూరికి నివాళి

**కనగానపల్లి:** మద్దెలచెరువు సూరి అలియాస్ గంగుల సూర్యనారాయణరెడ్డికి అభిమానులు, కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో శుక్రవారం మద్దెలచెరువు సూరి 14వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దెలచెరువు సూరి భార్య గంగుల భానుమతి, కుటుంబ సభ్యులతో పాటు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి వచ్చిన నాయకులు సూరి ఘాట్ వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

## మండలాభివృద్ధికి సమన్వయంతో కృషి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

**తాడిమర్రి:** మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ వెంకటరంగారావు అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు, సీసీ రోడ్లు తదితర మౌళిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించుటకు అందరు కృషి చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు యర్రగంగు కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మ, కో ఆప్షన్ సభ్యులు బాబా ఫక్రొద్దీన్, సర్పంచులు బండారు బాలమ్మ, కుంటాల పుల్లయ్య, శెట్టిపల్లి వెంకటనారాయణరెడ్డి, మంజుల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మద్యంపై పటిష్ట నిఘా


రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్

**చెన్నేకొత్తపల్లి:** కర్ణాటక మద్యం అక్రమంగా తరలిరాకుండా సరిహద్దుల్లో నిఘా ఉంచాలని శ్రీసత్యసాయి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎంఆర్‌పీ ధరలకే మద్యం అమ్మకాలు చేయాలని ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సులు లేకుండాను కల్లును రవాణా చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్క్వాడ్ సీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

### తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తారు?

**ఎన్‌పీకుంట:** మండలంలోని పెడబల్లిలో పంచాయతీ తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తారంటూ ఉపసర్పంచ్ రామక్రిష్ణ ప్రశ్నించారు. పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పంచాయతీలో తీర్మానాలు లేకుండానే పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు ఏకమై పనులు చేశారని ఉపసర్పంచ్ ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఆంజినప్ప శుక్రవారం విచారణ చేపట్టారు. వార్డు మెంబర్లకు కనీస సమాచారం ఇవ్వకుండానే పనులు ఎలా చేస్తారన్నారు. తీర్మానాలు చేసే సమయంలో వార్డు మెంబర్లు అందుబాటులో లేకపోవడంతో వారి ఇంటికి నోటీసులు అంటించామని పంచాయితీ అధికారులు తెలిపారు. అధికారులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, కనీస సమాచారం ఇవ్వకండానే తీర్మానాలు చేసుకుని పనులు చేశారంటూ ఉపసర్పంచ్, పలువురు వార్డు మెంబర్లు మండిపడ్డారు.

**పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా**

**పుట్టపర్తి:** ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గణేష్‌రెడ్డి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం జగదీష్, పీడీ నాగరాజు శుక్రవారం తెలిపారు.

**రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత**

**బత్తలపల్లి:** చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శుక్రవారం పట్టుకున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలపారు. టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు.

**నిందితుల ఇళ్లలో సోదాలు**

**కదిరి టౌన్:** పట్టణంలో తరుచూ గంజాయి రవాణా, మట్కా, లాటరీ వంటి చట్ట వ్యతిరేక పనులు చేసే వారి ఇళ్లలో సీఐ వి.నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్జాన్ శుక్రవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. అలాగే ఇరానీ స్ట్రీట్‌లో నివాసం ఉంటూ గంజాయి రవాణా చేస్తున్నారన్న అనుమానంతో 11 మందిని, గంజాయి అమ్ముతూ పట్టుబడిన వలీబాషా, ఫరూక్, ముజాహిద్, ముబారక్, ఎస్‌కే ఇర్ఫాన్, మట్కా ఆడిస్తూ పట్టుబడిన ఖాదర్ బాషా, కరీమ్, ఖలీల్, నాగరాజు, ఆంజనేయులు, లాటరీ ఆడిస్తూ పట్టుబడిన షబ్బీర్, సయ్యద్ మహమ్మద్, బీఎస్ రాధాకృష్ణను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

### పరామర్శ


హనుమంతరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**రామగిరి:** మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి తండ్రి హనుమంతరెడ్డి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తిమ్మాపురం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. హనుమంత రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గోసే నాగార్జున, మారుతీప్రసాద్, నాయకులు సుధీర్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, మీనుగ నాగరాజు, నరేంద్ర, వెంకటరెడ్డి, సిద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కుబడిగా మండల మీట్


మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకరప్ప

**చెన్నేకొత్తపల్లి:** చెన్నేకొత్తపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ అంజలి అధ్యక్షతన జరిగింది. నిర్ణీత సమయానికి సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా గంట ఆలస్యంగా ప్రారంభమైయింది. సమావేశం ప్రారంభంలో దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో ఎలాంటి చర్చలు జరగకుండా ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు.

### నూతన సంవత్సర శుభాకాంక్షలు


అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ రత్న

**పుట్టపర్తి టౌన్:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషీని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, పూల మొక్క అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.